విలేకరులు కావలెను
మెదక్ టుడే తెలుగు దినపత్రిక,జ్వాల తెలుగు న్యూస్ చానల్‌లో పనిచేయుటకు,తెలంగాణ, ఏపీలో నియోజకవర్గ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను
వివరాలకు సంప్రదించండి
సి.హెచ్ శివ కుమార్
9494117870,
9553335493

RNI NO,TELTEL/2023/88524

# మెదక్ టుడే

తెలుగు దినపత్రిక MEDAK TODAY

శుక్రవారం, నవంబర్ 29 2024 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 53


## ప్రియాంక గాంధీ ఎంపీగా ప్రమాణ స్వీకారం...



**హైదరాబాద్, నవంబర్ 28:** కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ఎంపీగా గురువారం ప్రమాణ స్వీకారం చేశా రు. తల్లి సోనియా గాంధీ,సోదరుడు రాహుల్ గాంధీతో కలిసి ఆమె పార్లమెంట్‌కు హాజర య్యారు. శీతాకాల సమావేశాల్లో భాగంగా లోక్ సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ఆమెతో ప్రమాణం చేయించారు. తన చేతిలో ఉన్న రాజ్యాంగ పుస్తకం చూపిస్తూ ప్రియాంక ప్రమాణ స్వీకారం చేశారు. ప్రియాంక కు పలువురు అభినందన లు తెలిపారు. కేరళ సాంప్ర దాయాన్ని ప్రతిబింబించేలా ఆమె సభకు హాజరయ్యా రు. ఎంపీ హోదాలో ప్రియాంక గాంధీ తొలిసారి లోక్ సభలోకి ప్రవేశి ంచారు. ప్రత్యక్ష ఎన్నికల్లో అరంగే ట్రం చేసిన ఆమె మొదటి సారే భారీ విజయా న్ని అందుకున్నారు. ఇటీవల కేరళలోని వయ నాడ్ లోక్ సభ స్థానానికి ఉప ఎన్నిక జరగగా 4 లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో ఆమె భారీ విజయం సాధించారు. ప్రియాంక ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆమె పిల్లలు రైహాన్ వాద్రా, మిరయా వాద్రా హాజరై తల్లికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఫుడ్ పాయిజన్‌పై స్పందించిన సీఎం

● తరచూ స్కూళ్లు, హాస్టళ్లను తనిఖీ చేయాలి ● పిల్లల ఆహారంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు : సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 28:** విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అంచించాలని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తరచూ స్కూళ్లు, గురుకులాలను తనిఖీ చేయాలన్నారు. వసతి గృహాల్లో ఆహార కల్తీకి బాధ్యులైనవారి వేటు వేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల స్కూళ్లలో ఉన్న విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలని, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇవ్వవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారానికి సంబంధించి చోటుచేసుకుంటున్న ఘటనలపై ముఖ్యమంత్రి పలుమార్లు

వివరాలు 2లో

## రైతు భరోసాకు ఎగనామం

- రుణమాఫీ పేరుతో పంగనామాలు
- పంటల కొనుగోళ్లకు శఠగోపం
- ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఎగవేత
- దిలావర్‌పూర్‌లో దమనకాండ సృష్టించన ప్రభుత్వం
- రామన్నపేటను రావణకాష్టం చేసింది
- లగచర్ల రైతులను జైలుపాలు చేసింది
- రైతులకు కాంగ్రెస్ ఏమీ చేసిందని రైతు పండుగ?
- అల్లుడి కళ్ళలో ఆనందం చూసినందుకా?
- కాంగ్రెస్ రైతు పండుగపై కేటీఆర్ ఆగ్రహం



**హైదరాబాద్, నవంబర్ 28:** రైతులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చెయ్యలేదని బీఆర్ఎస్ లబోదిబో మంటుంటే.. కాంగ్రెస్ మాత్రం రైతు పండుగను 3 రోజులు చేసేందుకు భారీ ప్లాన్ వేసింది. లక్షల మంది రైతుల్ని మహబూబ్‌నగర్ జిల్లాకి తరలించబోతోంది. ఇదే బీఆర్ఎస్‌కి నచ్చట్లేదు. రైతులకు కాంగ్రెస్ సర్కార్ ఏమీ చెయ్యకపోగా, రైతు పండుగ చెయ్యడమేంటని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు.ఇలాంటి అంశాలపై తరచూ ట్వీట్లు పెట్టే కేటీఆర్.. తాజాగా మరోసారి అదే చేశారు. ఓ భారీ ట్వీట్ పెట్టారు.. అందు లో.. “సిగ్గు లేదా జీడిగింజా అంటే – నల్లగున్నా

వివరాలు 2లో

## జార్ఖండ్ రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

### 14వ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరేన్ ప్రమాణ స్వీకారం



**రాంచి,నవంబర్ 28 :** జార్ఖండ్ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఆ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా జేఎంఎం చీఫ్ హేమంత్ సోరేన్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రిగా హేమంత్ ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. రాంచీ లో జరిగిన ఈ కార్యక్రమానికి హేమంత్ సోరెన్ భార్య, పిల్లలు, తల్లిదండ్రులు షిబు సోరెన్, రూపి సోరెన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,

వివరాలు 2లో

## సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం

- బయటకు పరుగులు తీసిన కార్మికులు







## భారీ విస్తరణ పై ‘బన్యన్ నేషన్’ రూ.200 కోట్ల వ్యయం: ఐటీ మంత్రి

**హైదరాబాద్, నవంబర్ 28:** ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ పరిశ్రమతో సర్క్యులర్ ఎకానమీ (వృత్తాకార ఆర్థిక వ్యవస్థ)కి తోడ్పడుతున్న అంకుర సంస్థ ‘బన్యన్ నేషన్’ రూ.200 కోట్ల పెట్టుబడితో భారీ విస్తరణ చేపట్టేందుకు ముందుకొచ్చిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం నాడు సంస్థ ప్రతినిధులు సచివాలయంలో తనను కలిసిన అనంతరం ఆయన వివరాలు తెలిపారు. ప్రస్తుతం పటాన్ చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో 15 వేల

వివరాలు 2లో

## తెలంగాణపై తుపాన్ ఎఫెక్ట్

● రాష్ట్రంలో 3 రోజులు భారీ వర్షాలు..! ● పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో హెచ్చరికలు



**హైదరాబాద్, నవంబర్ 28:** లంగాణకు ఐఎండీ కీలక అలర్ట్ ఇచ్చింది. నేటినుంచి పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడుతాయని అంచనా వేసింది. పలు జిల్లాలకు ఎ ల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.

వివరాలు 2లో

## దివ్యాంగుల త్వరలోనే రూ.6,000 పింఛన్

- దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలనూ భార్తీచేస్తాం
- మహిళా, శిశు, దివ్యాంగుల సం క్షేమ శాఖల మంత్రి సీతక్క




## నేడు దీక్షా దివస్..

- తెలంగాణ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు
- అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు




## మరో 3 లక్షల మందికి త్వరలో రుణమాఫీ



# సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం

- బయటకు పరుగులు తీసిన కార్మికులు

**సంగారెడ్డి, నవంబర్ 28:** సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. జిల్లాలోని జిన్నారం మండలం కాజీపల్లి పారిశ్రామికవాడలోని అరోరా లైఫ్‌సైన్స్ పరిశ్రమలో గురువారం ఉదయం మంటలు చెలరేగాయి. ఎంబీ-2 బ్లాక్‌లోని రియాక్టర్లలో సాల్వెంట్ మిక్సింగ్ జరుగుతుండగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో కార్మికులు భయంతో బయటకు పరుగులు పెట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అందుపులోకి తీసుకొచ్చారు. రియాక్టర్ పేలుడుతో ఇండస్ట్రియల్ పార్కు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. హైదరాబాద్ జీడిమెట్ల ఎస్ఎస్‌వీ ఫ్యాబ్ ఇండస్ట్రీస్ పాలిథిన్ సంచుల తయారీ కంపెనీలో మంగళవారం భారీ ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. పరిశ్రమలో చెలరేగిన మంటలను అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి అర్ధరాత్రి వరకు అదుపులోకి తీసుకువచ్చారు. కంపెనీలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. భవనంలోని మూడో అంతస్తులో మంటలు చేరగా.. క్రమంగా ఒకటో అంతస్తు వరకు మంటలు అంటుకున్నాయి. ఆ తర్వాత భవనం మొత్తం మంటలు చెలరేగాయి. మంటల సమయంలో ఫ్యాక్టరీలోని కెమికల్ డ్రమ్ములు పెద్ద ఎత్తున నిల్వ ఉన్నట్లు సమాచారం. ఈ సమయంలో ఆ డమ్ములన్నీ పేలడంతో మంటలు మరింత చెలరేగాయి. ఫలితంగా మంటలను ఆర్పివేయడం అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. భారీగా చెలరేగిన మంటలతో ఆ ప్రాంతమంతా భారీగా పొగ కమ్మేసింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి నగరంలోని పలుచోట్ల నుంచి ఏడు ఫైరింజన్లను తరలించారు. అలాగే, వాటర్ బోర్డుతో పాటు ప్రైవేటు ట్యాంకర్లతో నీటిని తరలించారు. ఒక దశలో మంటలు వంద మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడ్డాయి. దాంతో పాటు 200 మీటర్ల వరకు వేడిసెగలు వచ్చాయి. రసాయన డ్రమ్ముల పేలుడుతో మంటలు భారీగా ఎగిసిపడగా.. మంటలను అదుపులోకి తేవడం అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందికరంగా



మారింది. మంటల ధాటికి భవనం గోడలు బీటలు వారి కూలిపోయింది. ప్రమాదంలో దాదాపు రూ.100కోట్లకుపైగా నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. ప్రమాదం జరిగిన సమయంలో కంపెనీలు వంద మందికిపైగా కార్మికులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం నేపథ్యంలో కార్మికులంతా బయటకు వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది.

# నేడు దీక్షా దివస్..

- తెలంగాణ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు
- అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు

**/హైదరాబాద్, నవంబర్ 28:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను త్యాగం చేసేందుకు సిద్ధపడ్డ గొప్ప నాయకుడు కేసీఆర్ అని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించే కార్యక్రమం ఏర్పాట్లను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, దీక్ష దివస్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జి ఇంచార్జి పొన్నాల లక్ష్మయ్య, సికింద్రాబాద్, అంబర్ పేట, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, కాలేరు వెంకటేష్,



ముఠా గోపాల్, మాజీమంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, నాంపల్లి, ఖైరతాబాద్ నియోజకవర్గాల ఇంచార్జిలు ఆనంద్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అంతకుముందు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష తెలంగాణా ఉద్యమాన్ని కీలకమలుపు తిప్పిందని చెప్పారు. తెలంగాణ ప్రాంతంలోని అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ రాష్ట్రం రావాలి.. తెలంగాణ రాష్ట్రం కావాలని నినదించడం జరిగిందని గుర్తు చేశారు. అటువంటి దీక్షా దివస్‌ను అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని అన్ని నియోజకవర్గాల నుండి బైక్‌లపై ర్యాలీగా బసవ తారకం హాస్పిటల్ సర్కిల్ వరకు చేరుకుంటారని, అక్కడి నుండి పాదయాత్రగా తెలంగాణ భవన్‌కు చేరుకోనున్నట్లు చెప్పారు. తెలంగాణ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, కేసీఆర్ ఉద్యమ నేపథ్యాన్ని వివరించేలా ప్రత్యేకంగా రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించడం జరుగుతుందని, అనంతరం సభ నిర్వహణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు

## ఫుడ్ పాయిజన్‌పై స్పందించిన సీఎం

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించారు. కలెక్టర్లు తరచూ పాఠశాలల, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని.. అనంతరం అందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సీఎం ఆదేశించారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు వెనుకాడమని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంతో పాటు వారికి పౌష్టికాహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. విద్యార్థుల విషయంలో తాము సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వసతిగృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా పుకార్లు సృష్టించడంతో పాటు లేని వార్తలను ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని.. వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## రైతు భరోసాకు ఎగనామం

(మొదటి పేజీ తరువాయి)

నాకేం సిగ్గు అన్నదంట! రైతు భరోసాకు ఎగనామం పెట్టి, రుణమాఫీ పేరుతో పంగనామాలు పెట్టి, పంటల కొనుగోళ్లకు శఠగోపం పెట్టి, ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఎగ్గొట్టి, దిలావర్‌పూర్‌లో దమనకాండ సృష్టించి, రామన్నపేటను రావణకాష్టం చేసి, లగచర్ల రైతులను జైలుపాలు చేసి, అల్లుడి కళ్ళలో ఆనందం చూసినందుకా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. "రైతు పండుగలా ? పండుగలు మీకు, పస్తులు రైతులకు, చెప్పింది బారానా, చేసింది చారానా, కల్లాల్లో ధాన్యం పోసి, కళ్లల్లో వత్తులు వేసుకొని, కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్న రైతులు. నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టి కొనుగోళ్లు చేపట్టకపోవడంతో, అడ్డికి పావుశేరు లెక్కన దళారులకు అమ్ముకుంటున్నారు" అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.

## వివరాలు నమోదు చేయించుకున్న సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 28:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తన కుటుంబ వివరాలను కుల సర్వేలో నమోదు చేయించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరా లు నమోదు చేయించుకున్నారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి , ఇతర అధికారులు, ఎన్యుమరేటర్లు, సిబ్బందితో కూడిన సర్వే బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు. సర్వే పురోగతి వివరాలను, సర్వేలో పాల్గొన్న ప్రజల స్పందన గురించి అధికారులను సీఎం అడిగి తెలుసు కున్నారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేలా కార్యా చరణ ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్పని సరిగా సర్వేలో వివరాలు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టా లని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు.

## జార్ఖండ్ రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజశ్వి యాదవ్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఆయన భార్య సునితా కేజ్రీవాల్, ఎంపీ రాఘవ్ చద్దా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన హేమంత్ సోరెన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


# తెలంగాణపై తుపాన్ ఎఫెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

నైరుతి బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం నెమ్మదిగా కదులుతుంది. గడిచిన 6 గంటల్లో గంటకు 2 కిమీ వేగంతో కదులుతుందని ఐఎండీ తెలిపింది. చెన్నైకి 480 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది.రాగల 12 గంటల్లో శ్రీలంక తీరాన్ని దాటి ఉత్తర-వాయువ్య దిశగా పయనమవుతుందని అంచనా వేసింది.ఉదయంలోపు తుపానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. శనివారం (నవంబర్ 30వ తేదీ) ఉదయం ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాల సమీపంలో కారైకాల్ మరియు మహాబలిపురం మధ్య తీవ్ర వాయుగుండంగా తీరం దాటే అవకాశం ఉందని తాజా బులెటిన్ లో పేర్కొంది. ఈ ప్రభావంతో 3 రోజులు ఏపీలోని దక్షిణకోస్తాలో అక్కడక్కడ భారీ వర్షాలు,రాయలసీమలో శుక్ర,శనివారాల్లోఅక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలినచోట్ల విస్తారంగా తేలికపాటి-మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది.శనివారం దక్షిణకోస్తా,రాయలసీమలో కొన్నిచోట్ల భారీ-అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.మరోవైపు తెలంగాణకు ఐఎండీ కీలక అలర్ట్ ఇచ్చింది. తుఫాన్ ప్రభావంతో రేపట్నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉంది. నేడు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక నవంబర్ 30వ తేదీన కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. డిసెంబర్ 1న తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.డిసెంబర్ 2వ తేదీన తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జగనాం, సిద్ధిపేట జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. మళ్లీ డిసెంబర్ 3,4 తేదీల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎలాంటి హెచ్చరికలు లేవని ఐఎండీ వివరించింది.

# మరో 3 లక్షల మందికి త్వరలో రుణమాఫీ

- ఈనెల 30న ఖాతాల్లోకి డబ్బులు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి



**హైదరాబాద్, నవంబర్ 28:** రుణమాఫీ కాని వారిని డబ్బులు జమ చేయటంపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. బుధవారం షాద్ నగర్ లో మాట్లాడిన ఆయన పలు కారణాలతో రుణమాఫీ జరగని 3 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని పేర్కొన్నారు. నవంబర్ 30వ తేదీన మహబూబ్ నగర్ లో జరగనున్న రైతుపండగ సందర్భంగా డబ్బులు జమ చేస్తామని ప్రకటన చేశారు.రుణమాఫీకి రూ.18 వేల కోట్లు ఖర్చు చేశామని.. మిగతా రైతులకు కూడా అందజేస్తామని తెలిపారు. కుటుంబ నిర్ధారణ ప్రక్రియకు సమయం తీసుకోవటంతో పలువురు రైతులకు మాఫీ కాలేదని చెప్పారు. వ్యవసాయ శాఖాధికారులు గత 3 నెలలుగా రైతుల వివరాలు సేకరించారని... తప్పులను సరిచేశారని వివరించారు. వీరందరికీ ఈనెల 30వ తేదీన డబ్బులు చేస్తామని స్పష్టం చేశారు. కాగా తెలంగాణలోని కాంగ్రెస్ రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ స్కీమ్ ను పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే.

# భారీ విస్తరణపై 'బన్యన్ నేషన్' రూ.200 కోట్ల వ్యయం: ఐటీ మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

టన్నుల వార్షిక సామర్థ్యంతో 'బన్యన్ నేషన్' రీ సైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తోంది. దీనిని 45 వేల టన్నులకు విస్తరించడానికి ఏర్పాట్లు చేసుకుంటోందని ఆయన చెప్పారు. విస్తరణ పూర్తయితే మరో 500 మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు. రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ ను ఈ సంస్థ యూనిలివర్, టాటా మోటార్స్ లాంటి పెద్ద కంపెనీలకు విక్రయిస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. రూ.100 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న 'బన్యన్ నేషన్' లాభాల్లో నడుస్తోందని చెప్పారు. కొత్త ప్లాంట్ల ఏర్పాటు కోసం వారు మరికొంత భూమిని అడుగుతున్నారని, దీనిపై టీజీఐఐసీ నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఐటీ సలహాదారు సాయికృష్ణ, టీజీఐఐసీ సిఇఓ వి. మధుసూదన్, బన్యన్ నేషన్ సిఇఓ మణి వాజిపేయ్, సిఓఓ రాజ్ కిరణ్ మదనగోపాల్ లు పాల్గొన్నారు.

# దివ్యాంగుల త్వరలోనే రూ.6,000 పింఛన్

- దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలనూ భార్తీచేస్తాం
- మహిళా, శిశు, దివ్యాంగుల సం క్షేమ శాఖల మంత్రి సీతక్క



**/హైదరాబాద్, నవంబర్ 28:** మహిళా, శిశు, దివ్యాంగుల సం క్షేమ శాఖల మంత్రి సీతక్క తాజాగా పెన్షన్‌కి సంబంధించి కీలక ప్రకటన చేశారు. దివ్యాంగుల పింఛన్‌ని త్వరలోనే రూ.6,000కి పెంచుతామని అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన దివ్యాంగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పింఛన్ పెంపుపై ఆమె మాట్లాడారు. అలాగే దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలనూ నింపుతామని అన్నారు. మిగతా వారికీ పెంపు?: పెన్షన్ పెంపు అనేది ఒక్క దివ్యాంగులకు మాత్రమే ఉండదు. పెంచితే.. అన్ని రకాల పింఛను దారులకూ పెంపు ఉంటుంది. ఆ రకంగా చూస్తే వృద్ధులు, బీడీ కార్మికులు ఇలా అందరికీ పెంపు వర్తిస్తుంది. అందువల్ల పెన్షన్ పెంపు అనేది ఇప్పుడు కీలక అంశంగా మారింది. పెంపు ఎప్పుడో మంత్రి క్లారిటీ ఇవ్వలేదు. అతి త్వరలో అన్నారు. అది ఎప్పుడో మాత్రం చెప్పలేదు. డిసెంబర్‌లో పెంపు ఉండే అవకాశాలు లేవు. ఎందు కంటే.. మిగిలిన రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పథకాలకు ఇచ్చేందుకే డబ్బు లేదు. అలాం టప్పుడు పెన్షన్ పెంపు డిసెంబర్‌లో ఉండటం కష్టమే. మరి జనవరి నుంచి ఇస్తారా అనేది చూడాలి. డిసెంబర్ 7 నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతుంది. అందువల్ల జన వరి నుంచి పెన్షన్ పెంచితే, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లు అవుతుంది. పెంచకపోతే మాత్రం పెన్షన్ దారులను మోసం చేసినట్లే అవుతుంది. అందుకే.. పెంపు ఎప్పుడా అని వారు ఎదురుచూస్తున్నారు. ఏపీలో కూటమి పార్టీలు ఎన్నికల్లో మాట ఇచ్చినట్లుగానే పెన్షన్లను పెంచాయి.

# ఫ్యూచర్స్ అండ్ ఎక్స్‌పైరీ డేట్.. భారీ నష్టాలతో ముగిసిన ఇండెక్స్‌లు

**హైదరాబాద్ :** అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అనుసరించే వాణిజ్య విధానాలు, వడ్డీరేట్లపై యూఎస్ ఫెడ్ రిజర్వు వైఖరిలో అనిశ్చితి ఫలితంగా దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. గురువారం మంత్లీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ఎక్స్‌పైరీ డేట్ కూడా జత కలవడంతో బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ ఒక శాతానికి పైగా నష్టాలతో స్థిర పడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1190 పాయింట్లు (1.48 శాతం0 నష్టపోయి 79,043.74 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 80,447.40 పాయింట్ల గరిష్టానికి చేరుకుని 78,918.92 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. అలాగే ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 360.75 పాయింట్లు పతనమై 23,914.15 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో 24,345.75 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లి.. 23,873.35 పాయింట్ల కనిష్టానికి పతనమైంది. ఉక్రెయిన్ విద్యుత్ మౌలిక వసతుల ప్రాజెక్టులపై



రష్యా క్షిపణి, డ్రోన్ దాడులు చేయడంలో భౌగోళిక ఉద్రిక్తతలు పెరుగుతాయన్న భయాల మధ్య ఈక్విటీ మార్కెట్లు పతనం అయ్యాయి.ఎన్ఎస్ఈ -50లో 46 స్టాక్స్ నష్టాలతో సరి పెట్టుకున్నాయి. ఎస్బీఐ లైఫ్, ఇన్ఫోసిస్, హెచ్డీఎఫ్సీ లైఫ్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ 5.43 శాతం వరకూ నష్టపోయాయి. అదానీ ఎంటర్ ప్రైజెస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్బీఐ, సిప్లా స్టాక్స్ మాత్రం 1.63 శాతం వరకూ లాభ పడ్డాయి. నిఫ్టీ మిడ్ క్యాప్-100, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 ఇండెక్స్‌లు 0.05 శాతం చొప్పున పతనం అయ్యాయి. అత్యధికంగా నిఫ్టీ ఐటీ ఇండెక్స్ రెండు శాతానికి పైగా నష్టపోగా, నిఫ్టీ ఆటో, ఫైనాన్షియల్స్, ప్రైవేట్ బ్యాంక్, కన్జూమర్ డ్యూరబుల్స్, హెల్త్ కేర్ ఇండెక్స్‌లు నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ పీఎస్ యూ బ్యాంక్, మీడియా ఇండెక్స్‌లు 0.93 శాతం వరకూ లాభ పడ్డాయి.బీఎస్ఈ సెన్సెక్స్ -30 ఇండెక్స్‌లో ఎస్బీఐ మినహా అన్ని షేర్లు నష్టపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, హెచ్ సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్ స్టాక్స్ నష్టపోయారు. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 73 డాలర్లు, ఔన్స్ బంగారం 2645 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

# ఈ సీజన్‌లో ఈ ఆయుర్వేద మూలికలను వాడండి.. రోగాల నుంచి సురక్షితంగా ఉండండి..!



**హైదరాబాద్ :** చలి తీవ్రత కారణంగా అందరూ చాలా ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన చలి కారణంగా విపరీతమైన దగ్గు, జలుబుతోపాటు తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు అందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అయితే ఈ అనారోగ్య సమస్యలు తగ్గేందుకు సహజంగానే చాలా మంది ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడుతుంటారు. దీంతో సమస్య తాత్కాలికంగా తగ్గినా కూడా మళ్లీ వచ్చేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఇప్పుడు చెప్పబోయే ఆయుర్వేద మూలికలను ఈ సీజన్‌లో వాడితే దాంతో మీ రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. దగ్గు, జలుబు, జ్వరం వంటి సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇక ఆ ఆయుర్వేద మూలికలు ఏమిటి అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.మన చుట్టూ పరిసరాల్లో తిప్పతీగ పెరుగుతుంది. దీని కాండం కాస్త మందంగా ఉంటుంది. అయితే తిప్ప తీగ ఆకులను తెచ్చి రసం తీసి తాగవచ్చు. రోజుకు రెండు సార్లు అర టీస్పూన్ చొప్పున తిప్పతీగల ఆకుల రసం తాగుతుంటే శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఫలితంగా దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఈ సీజన్‌లో పసుపును కూడా రోజూ వాడాలి. పాలలో పసుపును కలుపుకుని రోజుకు రెండు సార్లు ఉదయం, సాయంత్రం తీసుకోవాలి. భోజనం అనంతరం ఇలా చేయాల్సి ఉంటుంది. పసుపులో సహజసిద్ధమైన యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇవి ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు, రోగాలనైనా తగ్గిస్తాయి. చలికాలంలో వచ్చే ఆర్థరైటిస్ నొప్పులను తగ్గించేందుకు కూడా పసుపు ఎంతగానో ఉపయోగపడుతుంది. కనుక ఈ సమస్యల నుంచి బయట పడాలంటే రోజూ పసుపు పాలను తాగాల్సి ఉంటుంది.

తులసి ఆకులు..శ్వాసకోశ సమస్యలను, సీజనల్ వ్యాధులను తగ్గించడంలో తులసి ఆకులు కూడా అద్భుతంగా పనిచేస్తాయి. తులసి ఆకులను నాలుగు తీసుకుని ఉదయాన్నే పరగడుపునే అలాగే తినవచ్చు. లేదా తులసి ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీటిని కప్పు మోతాదులో ఉదయం, సాయంత్రం రెండు పూటలా తాగవచ్చు. ఇలా తులసిని తీసుకుంటే ఎన్నో రోగాల నుంచి విముక్తి లభిస్తుంది. ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది.అశ్వగంధ..శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేసి రోగ నిరోధక శక్తిని పెంచడంలో అశ్వగంధ కూడా అద్భుతంగా పనిచేస్తుంది. అశ్వగంధ చూర్ణం, ట్యాబ్లెట్లు కూడా మనకు మార్కెట్‌లో లభిస్తాయి. వీటిని డాక్టర్ సలహా మేరకు వాడుకోవచ్చు. అశ్వగంధ చూర్ణాన్ని పావు టీస్పూన్ మోతాదులో ఉదయం, సాయంత్రం గోరు వెచ్చని పాలలో కలిపి తాగితే శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుంది. అలాగే రోజూ ఉదయాన్నే పరగడుపునే రెండు పచ్చి వెల్లుల్లి రెబ్బలను కాస్త దంచి నేరుగా అలాగే తినేయాలి. ఇవి ఘాటుగా ఉంటాయి కనుక వీటిని తినేటప్పుడు నాలుక మండకుండా ఉండేందుకు గాను కాస్త తేనెతో కలిపి వెల్లుల్లిని తినవచ్చు. ఇలా పలు రకాల మూలికలను తీసుకోవడం వల్ల చలికాలంలో వచ్చే అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

# ఇంటర్నల్ మార్కులు రద్దు..! తెలంగాణ పదో తరగతి పరీక్షల్లో కీలక మార్పులు

**హైదరాబాద్ :** తెలంగాణలో పదో తరగతి పరీక్షల్లో కీలక మార్పులు జరగనున్నాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులను జారీ చేసింది. ఇకపై వంద మార్కులకు ఎగ్జామ్ జరగనుంది. ఇంటర్నల్ మార్కులను పూర్తిగా ఎత్తివేసింది. ఇప్పటి వరకు 80 మార్కులకు వార్షిక పరీక్ష జరగగా20 మార్కులు ఇంటర్నల్ కోసం కేటాయించారు. అయితే సర్కార్ తాజా నిర్ణయంతో 100 మార్కులకు ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ నిర్ణయం అమల్లోకి రానుంది.వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపు తేదీలు:మరోవైపు తెలంగాణ పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజును స్వీకరిస్తున్నారు. నవంబర్ 28వ తేదీ వరకు ఎలాంటి రుసుం లేకుండా విద్యార్థులు ఫీజు చెల్లిచుకోవచ్చు. మరోవైపు నిర్దేశించిన గడువు దాటితే రూ.50 ఆలస్య రుసుంతో డిసెంబర్ 2 వరకు ఫీజు చెల్లించుకోవచ్చు. రూ. 200 ఆలస్య రుసుంతో డిసెంబర్ 12 వరకు ఫీజు చెల్లించవచ్చు. ఇక రూ. 500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 21 వరకు చెల్లించుకునే అవకాశం



ఉంటుంది.రెగ్యూలర్ విద్యార్థులు అన్ని పేపర్లకు కలిపి రూ. 125 ఫీజు చెల్లించాలి.మూడు పేపర్ల లోపు ఉంటే రూ. 110గా చెల్లించాలి. మూడు పేపర్ల కంటే ఎక్కువ బ్యాక్ లాగ్స్ ఉన్న విద్యార్థులు రూ. 125 చెల్లించాలి.ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ. 60 చెల్లించాలి. వెబ్ సైట్ లోకి వెళ్లి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు.ఆన్ లైన్ లో ఫీజు చెల్లింపుమరోవైపు ఫీజు చెల్లింపు ఇబ్బందులకు పరిష్కరించేలా ప్రభుత్వ పరీక్షల విభాగం చర్యలు చేపట్టింది. ఆన్ లైన్ లోనే పరీక్షల ఫీజును చెల్లించేలా ఆప్షన్ తీసుకొచ్చింది. పరీక్షల ఫీజు చెల్లించాలంటే విద్యార్థులు చదివే పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఫీజు రుసుం కట్టాలి.ప్రధానోపాధ్యాయుడు లేదా పాఠశాలల సిబ్బంది బ్యాంకుకు వెళ్లి చలానా తీసేవారు. ఇదంతా కూడా పని భారంగా మారిపోయింది. ఈ సమస్యలకు చెక్ పెట్టేలా వెబ్ సైట్ లో ఆన్ లైన్ పేమెంట్ ఆప్షన్ తీసుకొచ్చారు. ప్రాధానోపాధ్యాయులకు కేటాయించే వివరాల ద్వారా లాగిన్ అవుతారు. నేరుగా ఆన్ లైన్ లోనే ఫీజు చెల్లిస్తారు. ఫీజు చెల్లించిన 24 గంటల్లోపు స్టేటస్ అప్డేట్ అవుతుంది. లింక్ పై క్లిక్ చేసి ప్రాసెస్ చేసుకోవాల్సి ఉంటుంది.ఫీజుల చెల్లింపుల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించేలా పరీక్షల విభాగం మరికొన్ని చర్యలను కూడా చేపట్టింది. జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించటంతో పాటు హెల్ప్ లైన్ నెంబర్లను కూడా తీసుకొచ్చింది.

# వరంగల్ 'నిట్'లో ఉద్యోగ ఖాళీలు - ఆన్ లైన్




**హైదరాబాద్ :** లింక్ పై క్లిక్ ప్రాసెస్ చేసుకోవాల్సి ఉంటుంది.వరంగల్‌లోని 'నిట్' లో లైబ్రరీ ట్రైనీ పోస్టులను రిక్రూట్ చేయనున్నారు. ఇప్పటికే ఆన్ లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అయితే ఈ గడువు నవంబర్ 30వ తేదీతో పూర్తి కానుంది. అర్హులైన అభ్యర్థులు వెంటనే అప్లికేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.ఈ రిక్రూట్ మెంట్ లో భాగంగా భాగంగా ఐదు లైబ్రరీ ట్రైనీ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. నవంబర్ 30వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. వెబ్ సైట్ లోకి వెళ్లి ప్రాసెస్ పూర్తి చేసుకోవాలి.మొత్తం ఖాళీలు - 5ఈ పోస్టులను తాత్కాలిక, కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తారు.దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 55 శాతం మార్కులతో పూర్తి చేసి ఉండాలి.ఎంపికైె వారికి నెలకు రూ. 20వేల జీతం చెల్లిస్తారు. కేవలం ఆన్ లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తారు.55 శాతం మార్కులతో ఎంఎల్ఐసీ పూర్తి చేసి ఉండాలి.జీతం - రూ. 20,000 చెల్లిస్తారు.దరఖాస్తులకు చివరి తేదీ - నవంబర్ 30, 2024.దరఖాస్తు ఫీజు - రూ. 1000 చెల్లించాలి. ఎస్సీ, ఎస్సీ, దివ్యాంగ, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.ఎంపిక విధానం ఎంపిక ఉంటుంది.

# నర్సుపై సామూహిక అత్యాచారం.. ప్రైవేట్ భాగాల్లో కర్ర, కారంపొడి




**లక్నో:** తనపై సామూహిక అత్యాచారం జరిగినట్లు ఒక నర్సు ఆరోపించింది. ప్రైవేట్ భాగాల్లో కర్ర చొప్పించడంతోపాటు కారంపొడి పోసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని జలౌన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక మహిళ స్టాఫ్ నర్సుగా పని చేస్తున్నది. గురువారం ఉదయం స్కూటీపై డ్యూటీకి వెళ్తున్నది. మార్గమధ్యలో కొందరు వ్యక్తులు అడ్డుకున్నారని తెలిపింది. కొట్టి చెట్లపొదల్లోకి లాక్కెళ్లారని చెప్పింది. నలుగురు వ్యక్తులు పట్టుకోగా ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. ప్రైవేట్ భాగంలోకి కర్రను చొప్పించడంతోపాటు కారంపొడి చల్లినట్లు ఫిర్యాదు చేసింది.కాగా, బాధితురాలు తన భర్తకు ఫోన్ చేసి ఈ విషయం చెప్పింది. ఆమె భర్త సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత మహిళను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

# ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ.. మణిపూర్‌సిగ్నాతో చర్చలు

**హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ రంగ బీమా సంస్థ 'భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)'.. ఆరోగ్య బీమా రంగంలో అడుగు పెట్టడానికి ప్రయత్నిస్తున్నది. అందుకోసం మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలో 50 శాతం వాటా కొనుగోలుకు చర్చిస్తున్నట్లు సమాచారం. ఎల్ఐసీ ప్రస్తుతానికి జీవిత బీమాకు పరిమితమైనా.. తన పోర్ట్ ఫోలియోను ఆరోగ్య రంగానికి విస్తరించడానికి మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ లో వాటా కొనుగోలు ఉపకరిస్తుంది.అమెరికా సిగ్నా కార్పొరేషన్, మణిపాల్ ఎడ్యుకేషన్-మెడికల్ గ్రూప్ జాయింట్ వెంచర్ బీమా సంస్థే మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్. ఇందులో మణిపూర్ గ్రూపునకు 51 శాతం, సిగ్నా కార్పొరేషన్‌కు 49 శాతం వాటాలు ఉన్నాయి. ఈ జాయింట్ వెంచర్ కంపెనీలో 50 శాతం వాటా కొనుగోలు కోసం ఎల్ఐసీ చర్చిస్తున్నది. దీనికి అనుగుణంగా రెండు సంస్థలు తమ వాటా తగ్గించుకోనున్నాయి. ప్రస్తుతం చర్చలు ప్రాథమిక దశలోనే ఉన్నాయని ఓ ఆంగ్ల దినపత్రిక వార్తకథనం.ఆరోగ్య బీమా రంగంలోకి ఎంటర్ కావాలని భావిస్తున్నామని గతంలోనే ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ్ మొహంతి చెప్పారు. ఇప్పటికే ఆరోగ్య రంగంలో సేవలందిస్తున్న బీమా సంస్థలో వా టాలను కొనుగోలు చేస్తామని, అందుకు కసరత్తు జరుగుతున్నదన్నారు. మణిపాల్ సిగ్నా హె ల్త్ ఇన్సూరెన్స్ సంస్థలో ఎల్ఐసీ రూ.1750-2000 కోట్ల పెట్టుబడులుతెలుస్తున్నది.

# తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్రం అభివృద్ధి.. మాస్టర్ ప్లాన్‌కు నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు

**నంద్యాల:** తిరుమల తరహాలోనే శ్రీశైల మహా క్షేత్రాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు సమగ్ర వివరాలతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు నివేదికలు ఇవ్వాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్‌తో కలిసి కలెక్టర్ చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ.. పర్యాటక రంగ అభివృద్ధిట్లు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో శ్రీశైలం మహా క్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించి నివేదికలు పంపాలని గత సోమవారం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన దేవాదాయ, పర్యాటక, ఆర్ అండ్ బీ మంత్రుల కమిటీ సమావేశంలో నిర్దేశించారని తెలిపారు. ఈ మేరకు జిల్లాలో శ్రీశైల మహా క్షేత్ర అభివృద్ధికి సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు అవసరమయ్యే నివేదికలను శుక్రవారం సాయంత్రంలోగా అందజేయాలని దేవాదాయ, అటవీ, సర్వే అధికారులను కలెక్టర్ ఆదేశి



ంచారు. రాబోయే రెండేండ్లలో శ్రీశైలం క్షేత్రాన్ని తిరుమల క్షేత్ర తరహాలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో నివేదికలు తయారు చేసి ఇస్తే మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.గతంలో దేవాదాయ, అటవీ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే నివేదికలను కూడా పొందుపరచాలని సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ ఆదేశించారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన అటవీ విస్తీర్ణం, అటవీ సరిహద్దుల సర్వే, గెజిట్ నోటిఫికేషన్, నందికొట్కూరు రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణుల నిషేధిత భూములు సంబంధిత వివరాలతో నివేదికలు అందజేయాలని డీఎఫ్ఓ ను కలెక్టర్ ఆదేశించారు.శ్రీశైల దేవస్థానం ఆధీనంలో ఉన్న భూములు, అటవీ సరిహద్దుల నుంచి రక్షణ గోడలు, తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి సంబంధించిన నివేదికలను అందజేయాలని శ్రీశైలం దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ను కలెక్టర్ కోరారు. శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి గతంలో మంత్రుల కమిటీ సూచించిన అంశాలు, తయారు చేసిన నివేదికలను కూడా అందచేయాలన్నారు. సున్నిపెంట నుంచి శ్రీశైలం వరకు 2.5 కిలోమీటర్ల ఐకానిక్ బ్రిడ్జి ఏర్పాటు ప్రతిపాదనలు, రహదారి విస్తరణ సంబంధించిన పనులు కూడా మాస్టర్ ప్లాన్ నివేదికలో పొందుపరుస్తామని కలెక్టర్ తెలిపారు.ఐ

# హల్ది వాగులో మృతదేహం లభ్యం

**- సూసైడ్ ఆ ..? - మర్డర్ ఆ ..? - అనుమానాస్పద స్థితిలో మృత దేహం ..**





**తూప్రాన్, నవంబర్ 28, మెదక్ టుడే న్యూస్:** తూప్రాన్ మండలం ఆబోతు పల్లి శివారు హల్ది వాగులో గురువారం రోజు గుర్తుతెలియని 30 సంవత్సరాల యువకుడి మృత దేహం లభ్యమైంది. సంఘటన స్థలాన్ని తూప్రాన్ డిఎస్పీ సోమ వెంకట్ రెడ్డి పరిశీలించారు. తూప్రాన్ ఎస్.ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం ఆబోతు పల్లి గ్రామ శివారు హల్ది వాగులో 30 సంవత్సరాల గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైందని తెలిపారు. యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుని మెడకు శాలువా మరియు వైరు బిగించి ఉన్నది. గుర్తుతెలియని యువకుడు అనుమానాస్పద మృతి కేసు గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
శుక్రవారం, నవంబర్ 29 2024

# ఈనెల 30 నుంచి బీఆర్ఎస్ 'గురుకుల బాట'

**హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమానికి సిద్ధమైంది. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు.రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమంబీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమం పట్టనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరాలను వెల్లడించారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 07 వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమం ఉంటుందని ప్రకటించారు.గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలను పరిశీలించనున్నారు. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నేతలు ఇందులో పాల్గొంటారని కేటీఆర్ చెప్పారు.గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ సర్కార్ సంక్షోభంలోకి నెట్టిందని కేటీఆర్ విమర్శించారు. 11 నెలల్లో 52 మంది విద్యార్థుల మరణించారని ఇందులో 38 ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరిగాయని తెలిపారు. పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను పొట్టన బెట్టుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేరని ముఖ్యమంత్రికి ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోతలేదని కేటీఆర్ దుయ్యబట్టారు. విద్యార్థులు చనిపోతున్నా ఒక్క సమీక్ష కూడా నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదని కామెంట్స్ చేశారు. గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరఫున అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఐదు గురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీని ఏర్పాటు చేసి నట్లు ప్రకటించారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా గురుకుల బాట కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కమిటీ నివేదికను పార్టీకి సమర్పిస్తుందని వివరించారు. ఈ నివేదికలోని అంశాలను శాసనసభ వేదికగా లేవనెత్తనున్నట్లు ప్రకటించారు.సీఎం రేవంత్ కీలక ఆదేశాలు :రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో తరచూ ఘటనలు చోటుచేసుకోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు, గురుకులాలను తరచూ తనిఖీ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అందజేయాలని స్పష్టం చేశారు. ఫుడ్ పాయిజన్, ఇతర ఘటనలకు బాధ్యులైన వారిపై వేటు వేయాలని ఆదేశాలు జారీ చేశారు.హాస్టళ్లలో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశి ంచారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు జరగడంపై సీఎం సీరియస్ అయ్యారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాశీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బం దిపై చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. లేని వార్తలను ప్రచా రం చేస్తూ.. విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని.. వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# చెడు వ్యసనాలకు బానిసలై గంజాయి విక్రయం.. జైలుకు వెళ్లొచ్చిన మారని తీరు.. మళ్లీ అరెస్టు



**హైదరాబాద్ :** గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అమ్మదీపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అరికెల శేఖర్ (23), అదే గ్రామానికి చెందిన బోయిని నరేష్(23), సుక్కసారి భాను ప్రసాద్(21) ముగ్గురు స్నేహితులు. వీరు అలవాట్లకు బానిసలై సులువుగా డబ్బులు సంపాదించడం కోసం గంజాయి విక్రయించాలని నిర్ణయించు కున్నారు. ముగ్గురు కలిసి ప్రస్తుతం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసినగండ్లలో నివసిస్తున్నారు.ఈ ముగ్గురు కలిసి సిద్దిపేట పరిసర ప్రాంతాలలో ద్విచక్రవాహనాలను దొంగతనం చేశారు. అదే మోటార్ సైకిల్‌పై భద్రాచలం జిల్లా సీలేరుకు వెళ్లి వర్ధన్ వద్ద 2, 3 సార్లు గంజాయి తీసుకొచ్చారు. గజ్వేల్, అమ్మదీపూర్ చుట్టూపక్కల గ్రామాల కూలీలకు, యువకులకు రెట్టింపు ధరకు విక్రయించారు. దీంతో వీరిని 8 నెలల కిందట గంజాయి అమ్మడానికి వెళ్తుండగా.. సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చారు.మారని తీరు..జైలుకు వెళ్లి వచ్చినా.. వారి తీరులో ఎలాంటి మార్పు రాలేదు. మళ్లీ అదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో వారం రోజుల కిందట శేఖర్, నరేష్ గంజాయి తీసుకుని రావడానికి సీలేరు వెళ్తున్నామని వారి స్నేహితుడు భాను ప్రకాష్‌కు ఫోన్ చేశారు. భానుప్రకాష్ పని ఉందని, గంజాయి కావాలని రూ. 7000 శేఖర్‌కు ఫోన్ పే ద్వారా పంపించాడు.ఈ క్రమంలో శేఖర్, నరేష్ ఇద్దరు కలిసి స్నేహితుడు బైక్‌పై సీలేరుకు వెళ్లి వర్ధన్ అనే వ్యక్తి వద్ద రూ. 30,800 ఇచ్చి 20 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. మోటార్ సైకిల్‌పై వస్తే ఎవరైనా పోలీసులు పట్టుకుంటారని భావించి శేఖర్.. ఒక బ్యాగులో 10 కిలోల గంజాయి పెట్టుకొని హైదరాబాద్ వరకు బస్సులో వచ్చాడు. అక్కడి నుండి ఊరికి వచ్చి ఎవరైనా చూస్తారని అనుమానంతో ఊరు బయట గ్రామ శివారులో మల్లన్న సాగర్ కట్ట వద్ద గంజాయిని దాచి పెట్టాడు.గంజాయి కావాలని భాను ప్రసాద్ రాగానే.. అక్కడికి వెళ్లి అందులో నుండి అతనికి 2 కిలోల గంజాయిని ఇచ్చాడు. ఈ క్రమంలో పోలీసులు చాకచక్యంగా శేఖర్, భానుప్రసాద్ అనే ఇద్దరిని పట్టుకొని విచారణ చేపట్టారు. నిందితుల వద్ద నుండి 10 కిలోల గంజాయి, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నరేష్, వర్ధన్ పరారీలో ఉన్నారు. త్వరలో ఇద్దరు నిందితులను పట్టుకుంటామని ఏసీపీ పురుషోత్తం రెడ్డి స్పష్టం చేశారు.

# మరో 3 లక్షల మందికి రుణమాఫీ...

## 30వ తేదీన ఖాతాల్లోకి డబ్బులు




**హైదరాబాద్ :** రుణమాఫీ కాని రైతులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల గుడ్ న్యూస్ చెప్పారు. వివిధ సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని 3 లక్షల మందికి రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. నవంబర్ 30వ తేదీన వారి ఖాతాల్లో డబ్బులు వేయనున్నట్లు పేర్కొన్నారు.రుణమాఫీపై మంత్రి తుమ్మల కీలక ప్రకటనతెలం గాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ స్కీమ్ ను పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో అధిక సంఖ్యలో రైతులకు రుణమాఫీ కాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం.. వారి వివరాల ను సేకరించింది. కుటుంబ నిర్ధారణ చేసేందుకు మూడు నెలల పాటు సమయం తీసుకుంది. ఈ ప్రక్రియ పూర్తి కావటంతో రుణమాఫీ కాని వారికి స్కీమ్ ను వర్తింపజేయనుంది.మంత్రి తుమ్మల కీలక ప్రకటన రుణమాఫీ కాని వారిని డబ్బులు జమ చేయటంపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. బుధవారం షాద్ నగర్ లో మాట్లాడిన ఆయనపలు కారణాలతో రుణమాఫీ జరగని 3 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని పేర్కొన్నారు. నవంబర్ 30వ తేదీన మహబూబ్ నగర్ లో జరగనున్న రైతుపండగ సందర్భంగా డబ్బులు జమ చేస్తామని ప్రకటన చేశారు.రుణమాఫీకి రూ.18 వేల కోట్లు ఖర్చు చేశామని.. మిగతా రైతులకు కూడా అందజేస్తామని తెలిపారు. కుటుంబ నిర్ధారణ ప్రక్రియకు సమయం తీసుకోవటంతో పలువురు రైతులకు మాఫీ కాలేదని చెప్పారు. వ్యవసాయ శాఖాధికారులు గత 3 నెలలుగా రైతుల వివరాలు సేకరించారని%ొ% తప్పులను సరిచేశారని వివరించారు.వీరందరికీ ఈనెల 30వ తేదీన డబ్బులు చేస్తామని స్పష్టం చేశారు.ప్రజా పాలన ఉత్సవాలు – పాలమూరులో భారీ సభ:డిసెంబర్ 1 నుంచి 9 వ తేదీ వరకు రాష్ట్రమంతా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో విజయో త్సవాల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికాంుంలను ఆదేశించారు."ఈ నెల 30వ తేదీన మహబూబ్ నగర్‌లో రైతులకు అవగాహన కల్పించే రీతిలో రైతు సదస్సుకు అవస రమైన ఏర్పాట్లు చేయాలి.డిసెంబర్ 4 వ తేదీన పెద్దపల్లి జిల్లా లో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ జరపాలి. ఆ వేది కగా గ్రూప్ 4 తో పాటు వివిధ రిక్రూట్‌మెంట్ల ద్వారా ఎంపికైన 9 వేల మందికి నియామక పత్రాలు అందించాలి.డిసెంబర్ 1 వ తేదీ నుంచి శాఖల వారీగా నిర్దేశించిన మేరకు వివిధ అభి వృద్ధి కార్యక్రమాలతో పాటు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఈ వారం రోజుల్లో జరిగేలా ప్రణాళికను రూపొందించాలి. తొలి ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేదికతో పాటు భవిష్యత్తు ప్రణాళికను ప్రజల ముందు ఆవిష్కరించాలి.డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ఉత్సవాలు నిర్వహిం చాలి.ఈ మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో సచివాలయ పరిసరాలు, ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతమంతా తెలంగాణ వైభవం వెల్లివిరిసేలా ఉత్సవాలు నిర్వహించ ాలి.పరిసరాల్లో ఎగ్జిబిషన్ లాంటి వాతావరణం ఉండేలా వివిధ స్టాళ్లను ఏర్పాటు చేయాలి. మూడు రోజుల పాటు తెలంగాణ సంస్కృతి, కళారూపాలు ఉట్టి పడే కార్యక్రమాలతో పాటు మ్యూజికల్ షోలు, ఎయిర్ షో, కన్నుల పండువలా ఉండే డ్రోన్ షోలను నిర్వహించాలి.రాష్ట్ర మంతటా అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీల్లోనూ ప్రజా పాలన విజయోత్సవ వేడుకలు నిర్వహించాలి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉత్సవ వాతావరణం ఉట్టిపడాలి.డిసెంబర్ 9 న సచివాలయ ముఖద్వారం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలి. ఈ వేడుకలకు తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, విద్యావ ంతులను, వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన వారందరినీ ఆహ్వానించాలి.ప్రతి నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మహిళా శక్తి ప్రతినిధులను ఆహ్వానించి... లక్ష మంది తెలంగాణ తల్లుల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేయాలి.డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్ నగరంలో జరిగే ఉత్సవాల సందర్భంగా సూచించారు.

# కొన్ని రోజుల తర్వాత 'హైటెక్ సిటీ' రైల్వే స్టేషన్‌ను గుర్తుపట్టలేరు!

**హైదరాబాద్ :** అమృత్ భారత్ పథకం కింద దేశ వ్యాప్తంగా ఉన్న పలు రైల్వేస్టేషన్లను.. భారతీయ రైల్వే అభివృద్ధి చేస్తోంది. ఈ పథకంలో భాగంగా హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను ఊహించని విధంగా అభివృద్ధి చేయబోతున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సౌత్ సెంట్రల్ రైల్వే వెల్లడించింది. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద.. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు.. సౌత్ సెంట్రల్ రైల్వే ప్రకటించింది. దేశ వ్యాప్తంగా 1275 స్టేషన్‌లను అభివృద్ధి చేయడానికి.. రైల్వే మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 2023లో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌ను ప్రారంభించింది. 'అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి

# విద్యార్థులకు నాణ్యత లేని భోజనం.. గురుకుల సిబ్బందికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చివాట్లు



**హైదరాబాద్ :** రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘట నల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గురుకులాన్ని గురువారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ క్రమంలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన నాణ్యత లేని భోజనాన్ని చూసిన జీవన్ రెడ్డి.. గురుకుల సిబ్బందిపై ఆగ్రహం చేశారు.ప్రభుత్వం నుంచి బిల్లులు తీసుకుంటున్నప్పుడు.. విద్యార్థులకు సరిపడా భోజనం ఎందుకు పెట్టడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్నించారు. ఆ గురుకులంలో ఉండే విద్యార్థులకు రెండు గిన్నెల నిండా అన్నం వండితే సరిపోతుంది.. కానీ ఒకే గిన్నెలో అన్నం మాత్రమే ఎందుకు వండుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నం ఉడకలేదని, నీళ్ల పప్పు, నీళ్ల చారు ఎందుకు వడ్డిస్తున్నారని ప్రశ్నించారు.మెనూ ప్రకారం వారంలో రెండు రోజులు విద్యార్థులకు నాన్ వెజ్ పెట్టాల్సి ఉండగా, నెలలో ఒకే రోజు నాన్ వెజ్ పెడుతున్నారని తెలిసి గురుకుల సిబ్బందిపై జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులంలోని విద్యార్థుల కోసం 30 లీటర్ల పెరుగు వాడాల్సి ఉండగా, కేవలం ఆరు లీటర్ల పెరుగుతో సరిపెట్టడంపైనా సిబ్బందిని నిలదీశారు. వారానికి ఐదు కోడి గుడ్లు ఇవ్వడం లేదని విద్యార్థులు చెప్పడంతో.. దానిపైనా గురుకుల సిబ్బందిని జీవన్ రెడ్డి నిలదీశారు. తన పరిశీలనలో వెల్లడైన సమస్యలను కలెక్టర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తానని ఆయన స్పష్టం చేశారు.

# భాగ్యలక్ష్మి పత్తి మిల్లులో భారీ అగ్నిప్రమాదం.. రూ. కోట్ల ఆస్తి నష్టం



**నారాయణపేట :** ధన్వాడకు సమీపంలోని లింగంపల్లి భాగ్యలక్ష్మి పత్తి మిల్లులో గురువారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం నేపథ్యంలో రూ. కోట్ల విలువ చేసే పత్తి పూర్తిగా కాలిపోయింది. కేబుల్ వైరు తెగిపడి కరెంట్ షాక్ రావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు.రైతులు, పత్తి వ్యాపారాలు అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని.. మంటలను అదుపు చేసింది. ఈ అగ్నిప్రమాద ఘటనపై మిల్లు సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రూ. కోట్ల విలువ చేసే పత్తి కాలి బూడిదైందని, తమను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఇటీవలే కాటన్ కార్పొరేషన్ ఇండియా ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభించారు. రైతులు పత్తి పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్న సమయంలో పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం జరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

# రూ. 5 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఏఈ



**వరంగల్ :** వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లంచం తీసుకుంటూ ఏఈ కార్తీక్ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.కాంట్రాక్ట్ బిల్లుల ఫైల్ క్లియరెన్స్ కోసం వర్ధన్నపేట మండలం కడారిగూడెకు చెందిన మాజీ సర్పంచ్ సతీశ్‌ను ఏఈ కార్తీక్ డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో మాజీ సర్పంచ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏఈ కార్తీక్ మాజీ సర్పంచ్ నుంచి రూ. 5 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. అనంతరం ఏఈని అధికారులు విచారించి కేసు నమోదు చేశారు.

# తిరుమలలో డిసెంబరులో విశేష పర్వదినాలు



**తిరుమల :** నిత్యం గోవిందానామస్మరణతో మారుమ్రోగే తిరుమలలో వచ్చేనెలలో జరుగబోయే విశేష పర్వదినాలను అధికారులు ప్రకటించారు. డిసెంబర్ 1న శ్రీవారి ఆలయంలో 4వ విడత అధర్వణ వేదపారాయణం ప్రారంభం అవుతుందని, 11న సర్వ ఏకాదశి, 12న చక్రతీర్థ ముక్కోటి కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.13న తిరుమంగై ఆళ్వార్ శాత్తుమొర, 14న తిరుప్పాణాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 15న శ్రీవారి ఆలయంలో కార్తీక దీపోత్సవం, 16న ధనుర్మాసారంభం, 26న సర్వ ఏకాదశి, 29న మాస శివరాత్రి, తొండరడిప్పొడియాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 30న అధ్యయనోత్సవాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.75 కోట్లుతిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిన్న స్వామివారిని 67,626 మంది భక్తులు దర్శించుకోగా 22,231 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తుల మొక్కుల ద్వారా హుండీకి రూ. 3.75 కోట్ల ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు ప్రకటించారు.

# లావా నుంచి ఎంట్రీ లెవల్ స్మార్ట్ ఫోన్ లావా యువ 4..



**హైదరాబాద్ :** ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ లావా ఇంటర్నేషనల్ తన ఎంట్రీ లెవల్ స్మార్ట్ ఫోన్.. లావా యువ 4 ఫోన్‌ను భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. 50–మెగా పిక్సెల్ మెయిన్ సెన్సర్ కెమెరా, 8–మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా, 5000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ, సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్, రెండు స్టోరేజీ ఆప్షన్లతో అందుబాటులో ఉంది. లావా యువ 4 ఫోన్ 4జీబీ ర్యామ్ విత్ 64 జీబీ ర్యామ్ స్టోరేజీ వేరియంట్ రూ.6,999, 4 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.7,499లకు లభిస్తుంది. గ్లాసీ బ్లాక్, గ్లాసీ పర్పుల్, గ్లాసీ వైట్ కలర్ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుందీ ఫోన్.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail medaktoday89@gmail.com-cll, 9948265095-9494117870..Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, medaktoday89@gmail.com 9948265095..